‘గుమ్మనూరు’ను చిత్తుగా ఓడిస్తాం


గుంతకల్లులో వాల్మీకి యువనేత బీకే శివకు పార్టీ కండువా వేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్


గుత్తిలో వైఎస్సార్‌సీపీలో చేరిన శ్రీరాంపురం గ్రామస్తులతో ఎమ్మెల్యే వై వెంకటరామిరెడ్డి


ఎమ్మెల్యే వైవీఆర్ సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన పామిడి మండలం నెమళ్లపల్లి గ్రామానికి చెందిన 40 కుటుంబాలు

- జయరామ్ బ్రదర్స్ అరాచకాలు ఇక్కడ సాగనివ్వం
- వాల్మీకి కులస్తులను మోసం చేసిన ద్రోహి జయరామ్
- బీకే శివతో పాటు 550 మంది యువకులు వైఎస్సార్‌సీపీలో చేరిక

గుంతకల్లుటౌన్: ప్రశాంతతకు మారుపేరుగా నిలిచిన గుంతకల్లులో టీడీపీ తరఫున పోటీ చేయనున్న మాజీ మంత్రి గుమ్మనూరు జయరామ్‌ను చిత్తు చిత్తుగా ఓడించాలని వాల్మీకి యువనేత బీకే.శివ, మాజీ కౌన్సిలర్ బీకే.రామచంద్ర కోరారు. వాల్మీకి కులస్థులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఇటీవల గుంతకల్లు నుంచి కాశీ వరకూ పాదయాత్ర చేసిన వాల్మీకి బీకే శివ, అతని తండ్రి మాజీ కౌన్సిలర్ బీకే రామచంద్ర ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ వార్డులకు వాల్మీకి, మైనార్టీ, ఇతర వర్గాలకు చెందిన సుమారు 550 మంది యువకులు గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. తొలుత హనుమాన్ సర్కిల్ నుంచి పురవీధుల్లో వందలాది బైక్‌లు, కార్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో వారు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వాల్మీకి బీకే శివ, రామచంద్ర మాట్లాడుతూ వాల్మీకి కులస్థుల మీద నమ్మకంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గుమ్మనూరు జయరామ్‌కు ఐదేళ్లు మంత్రి పదవి ఇస్తే, స్వార్థం కోసం కన్నతల్లి లాంటి పార్టీని మోసం చేసిన నమ్మక ద్రోహి అని మండిపడ్డారు. అసాంఘిక కార్యకలాపాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచిన గుమ్మనూరు జయరామ్ బ్రదర్స్ ఆగడాలు, అరాచకాలు గుంతకల్లులో సాగనివ్వమన్నారు. ప్రజలంతా గుమ్మనూరుకు ఓటుతో గుణపాఠం చెప్పాలన్నారు. ఎమ్మెల్యే వైవీఆర్‌ను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. పార్టీలో చేరిన వారిలో జల్లీ ఈశ్వరయ్య, బోయ రామాంజనేయులు, బీకే రంగా, పవన్, జిలాన్, రాము, సద్దామ్, రాజు, జాఫర్, మణి, అనిల్, రవి, పరమేష్, మస్తాన్‌తో వారి మిత్రులు ఉన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ రామలింగప్ప, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప, మాజీ అధ్యక్షుడు ఎద్దుల శంకర్, వార్డు ఇన్‌చార్జ్ మాచర్ల శివ, ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జ్ జింకల రామాంజి, జమీల్, అబ్దుల్‌బాసిద్, కోఆప్షన్ సభ్యుడు రాజశేఖర్, మార్కెట్ వెంకటేష్, పార్టీ యువజన విభాగం రాష్ట్ర మాజీ కార్యదర్శి సందీప్‌రెడ్డి, దరశథరెడ్డి, జంగ్గి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

గుత్తి రూరల్: మండలంలోని శ్రీపురం గ్రామానికి చెందిన పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన పాల రామాంజి ఆధ్వర్యంలో వెంకటేష్, సుంకప్పతో పాటుగా 10 కుటుంబాలకు చెందిన టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. తమ గ్రామం 67వ నంబర్ జాతీయ రహదారి నుంచి లచ్చానుపల్లి గ్రామం వరకూ గతంలో ఎవరి హయాంలో లేని విధంగా రోడ్డు, గ్రామంలో అభివృద్ధి పనులు చేయించారన్నారు. సీఎం జగన్ సంక్షేమ పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరామన్నారు. పార్టీ విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు.

వైఎస్సార్‌సీపీలోకి 30 దళిత కుటుంబాలు..

గుంతకల్లు రూరల్: మండలంలోని కసాపురానికి చెందిన 30 దళిత కుటుంబాలు ఆదివారం టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరాయి. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలోకి చేరిన వారిలో నాయకులు ప్రకాష్, రాజు, పవన్, మణి, యశ్వంత్, రఘు, సాయి, గణేష్, విల్సన్, అభి తదితరులు ఉన్నారు. వైఎస్సార్‌పీ నాయకులు కసాపురం మాజీ సర్పంచ్ తిక్కస్వామి, వినోద్ కుమార్‌రెడ్డి, బెస్త మనోహర్, చాకలి రామాంజనేయులు తదితరుల ఆధ్వర్యంలో వారు పార్టీలో చేరారు.

టీడీపీ, జనసేన నుంచి 120 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

పామిడి: పామిడి పట్టణంతో పాటు నెమళ్లపల్లికి చెందిన టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన పలు కుటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. గుంతకల్లులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పామిడిటౌన్ నుంచి పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూధన్ రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన నుంచి 80 కుటుంబాలు ఎమ్మెల్యే వైవీఆర్ సమక్షంలో చేరారు. అలాగే గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని నెమళ్లపల్లి నుంచి టీడీపీకి చెందిన 40 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. స్థానికేతరుడు, జంప్ జిలానీ అయిన గుమ్మనూరు జయరామ్‌కు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ దక్కడంతో అసంతృప్తికి గురైన టీడీపీకి చెందిన పలువురు పార్టీ తీర్థం పుచ్చుకుంటున్నారు. పార్టీలో చేరిన వారు మట్లాడుతూ సీఎం జగన్ సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలో చేరామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు, మండల ఇన్‌ఛార్జ్ సీటీ జానకిరామిరెడ్డి, పట్టణ, రూరల్ కన్వీనర్లు జోజోడే కుమార్, కే నారాయణరెడ్డి, బోయ రామచంద్ర, అనుంపల్లి సూరి, చినరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాబలం వైఎస్సార్‌సీపీ వైపే..


పార్టీలో చేరిన పెద్దపప్పూరు మండలవాసులతో ఎమ్మెల్యే పెద్దారెడ్డి


పార్టీలో చేరిన గంగాదేవిపల్లివాసులతో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి
- వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

తాడిపత్రిరూరల్: రోజు రోజుకూ తాడిపత్రి నియోజక వర్గంలో వైఎస్సార్‌సీపీకి ప్రజా బలం పెరుగుతోందని ఎమ్మెల్యే పెద్దారెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం పెద్దపప్పూరు మండలం అప్పెచెర్ల గ్రామంలోని టీడీపీకి చెందిన పెద్దయ్య, నారాయణప్ప, గుర్రప్ప, లక్ష్మీనారాయణ, ఓబుళపతితోపాటు 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో టీడీపీ ప్రాబల్యం తగ్గిపోతోందన్నారు. ఉనికి కోసం జేసీ ప్రభాకర్‌రెడ్డి కొంటున్న నాయకులను చూసి చీదరించుకుంటూ ప్రజలు స్వచ్ఛందంగా మద్దతిస్తూ వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారన్నారు. జేసీ ఓటమి భయంతో ఒకరిద్దరిని పార్టీలోకి చేర్చుకుంటూ బిల్డప్‌లతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాడన్నారు. ఉనికిని చాటుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలకు ప్రజలు ఎంతో ఆకర్షితులవుతున్నారు.

32 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

తాడిపత్రిటౌన్: మండలంలోని గంగాదేవిపల్లిలో తిరునాథ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, గంగిరెడ్డి, బోరుకిట్టా, వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో 32 కుటుంబాలు ఆదివారం టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆ గ్రామానికి వెళ్లి వారికి కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. గంగశేఖర్‌రెడ్డి, తిరుమలరెడ్డి, తలారిశేఖర్ తోపాటు 29 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. తాడిపత్రి ఎమ్మెల్యేగా కేతిరెడ్డి పెద్దారెడ్డి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణం నెలకొందన్నారు. గ్రామాల్లో ఎలాంటి రాజకీయ గొడవలు కక్షలు తావులేకుండా అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. పేదల సంక్షేమ జగనన్నతోనే సాధ్యం అని నమ్మి పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి తాము కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పేరం స్వర్ణలత, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రాజు, పార్టీ మండల కన్వీనర్ పల్లె నాగేశ్వరెడ్డి, బ్రాహ్మణపల్లి శివారెడ్డి, పాపిరెడ్డి, బాలరాజు, చుక్కలూరు హరీష్‌రెడ్డి, విజయ్‌కుమారెడ్డి ఆదిశంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల ప్రచారం

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని చెట్నేపల్లిలో రెండో రోజు ఆదివారం కూడా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రచారాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాసరెడ్డి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్ రెడ్డి, పార్టీ పట్టణ కన్వీనర్ పీరా, కౌన్సిలర్లు గద్దల రూతమ్మ, వాల్మీకి శివ, ఫరూక్, వరదరాజులు, కేవీ రమణ, నరేష్, వార్డు ఇన్‌చార్జ్‌లు గద్దల నాగేంద్ర, జగదీష్ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా వారు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. గుంతకల్లు ఎమ్మెల్యే అభ్యర్థి వై.వెంకటరామిరెడ్డి, అనంతపురం ఎంపీ అభ్యర్థి శంకర నారాయణను గెలిపించాలని కోరారు. జిల్లా నాయకులు మధుసూదన్ రెడ్డి, గురు ప్రసాద్‌యాదవ్, బేడల వెంకటరాముడు, జిల్లా ఉపాధ్యక్షులు సీవీ రంగారెడ్డి, వీరాంజనేయులు, జిల్లా మైనార్టీ కార్యదర్శి కటిక ఖురేషి అన్వర్, షఫి, రవూఫ్, వెంకటేష్, వీరా తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

గార్లదిన్నె: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పోలీసులు వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. ఆదివారం గార్లదిన్నె డ్యాం రోడ్డు వద్ద పోలీసులు ప్రతివాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపించారు. పోలీసులు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వాహన తనిఖీకి సహకరించాలన్నారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీలు వెంట ఉంచుకోవాలన్నారు. వాహనాల్లో డబ్బు తరలిస్తుంటే..సంబంధిత ఆధారాలను చూపాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక ‘ముసలమ్మ కట్ట’

- రేపు నాల్గవ వార్షికోత్సవ కుంభాభిషేకం


ముసలమ్మ తల్లి దేవాలయం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని తాడిపత్రి రహదారి పక్కన చెరువు కట్ట సమీపంలోని ముసలమ్మ దేవాలయం త్యాగానికి ప్రతీకగా నిలుస్తోంది. ముసలమ్మ వంశస్థులు సూర్యనారాయణ రెడ్డి, సుశీలమ్మ ఆలయ నిర్మాణం చేపట్టి నాలుగేళ్లయింది.. ఈ సందర్భంగా నాలుగో వార్షికోత్సవ కుంభాభిషేకం నిర్వహించనున్నారు.

ముసలమ్మ ఆలయ చరిత్ర

బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో ప్రజల సంక్షేమమే ధ్యేయంగా భావించి త్యాగానికి ప్రతీకగా ముసలమ్మ కట్ట నిర్మించారు. వివరాలు.. మండల కేంద్రంలో ఉన్న చెరువు సుమారు 300 ఏళ్ల క్రితం చెరువు నిండి ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో చెరువు కట్ట తెగిపోయింది. చెరువులో ఉన్న నీరంతా ఊరంతా ముంచేలా ప్రవహిస్తోంది. ప్రజలంతా గ్రామ సమీపంలో ఉన్న పోలేరమ్మను ప్రార్థించారు. ఈ సందర్భంగా చెరువు కట్ట సమీపంలో ఒక పెద్ద శబ్దంతో మాటలు వినిపించాయి. గ్రామంలో బసిరెడ్డి చిన్న కోడలు ముసలమ్మను చెరువు కట్టకు బలి ఇస్తే ఈ తెగిన చెరువు కట్ట నిలుస్తుందని ఆ మాటల సారాంశం. ఈ విషయాన్ని గ్రామస్తులు వెంటనే బసిరెడ్డికి విన్నవించారు. ఈ విషయం విన్న ముసలమ్మ ప్రాణ త్యాగానికి సిద్ధపడింది. అత్తమామలతోపాటు ప్రజల అనుమతి తీసుకుని దేవుని ప్రార్థించి ముసలమ్మ కట్ట సమీపంలో ఉన్న చెరువులోకి దూకింది. వెంటనే చెరువు వరద నీరు శాంతించి నిలిచిపోయిందని ప్రజలు, చరిత్ర చెబుతోంది. దీంతో గ్రామస్తులు చెరువు కట్ట సమీపంలో ఉన్న ముసలమ్మ దేవాలయంలో నేటికీ పూజలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఆ కుటుంబానికి చెందిన వంశస్థులు అయిన సూర్యనారాయణ రెడ్డి, సుశీలమ్మలు గుడి నిర్మాణం చేశారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

ఈ నెల 8న ఆలయంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు మూల దేవతా ప్రార్థన, గురు ప్రార్థన, గణపతి పూజ, స్వస్తి వాచనము, రక్షా బంధనం, నిర్వహించనున్నారు. 9న ఉదయం 6 గంటలకు అమ్మవారికి అభిషేకం, కలశ స్థాపన గణపతి హోమం, పంచామృతాభిషేకం, కలశ స్థాపన ఆదిత్యా నవగ్రహ హోమం, ముసలమ్మ అమ్మవారి మూల మంత్ర హోమం, ఉదయం 10 గంటలకు మహా పూర్ణాహుతి, మధ్యాహ్నం 12గంటలకు మహా మంగళ హారతి నిర్వహించున్నారు. సాయంత్రం 5గంటలకు ముసలమ్మ తల్లి అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగిస్తున్నామని ఆలయ ధర్మకర్త సుశీలమ్మ తెలిపారు.

సీఎం జగన్‌కు అండగా నిలవండి


బుర్నాకుంటలో ప్రచారం చేస్తున్న కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి

పెద్దవడుగూరు: సంక్షేమం కోసం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కి ప్రజా దేవుళ్లు అండగా నిలవాలని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కుమారుడు కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి కోరారు. ఆదివారం మండలంలోని బుర్నాకుంట, ముప్పాలగుత్తి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు మరోసారి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ గెలిపించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు గూడూరు సూర్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాశంరంగస్వామి, జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు చితంబరరెడ్డి, మండల కన్వీనర్ ఎద్దుల శరభారెడ్డి, జిల్లా కార్యదర్శి శేషారెడ్డి, అనంతపురం పార్లమెంట్ విభాగం ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, తాడిపత్రి మార్కెట్‌యార్డు చైర్మన్ హరినాథరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ వేణు, నాయకులు శేఖర్, లక్ష్మంపల్లి హరినాథరెడ్డి, మల్లేశ్వరెడ్డి, దిమ్మగుడి మోహన్‌రెడ్డి, బుర్నాకుంట నాగరాజు, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల నిర్వహణకు కొటేషన్ల ఆహ్వానం

గుంతకల్లుటౌన్: పట్టణ నడిబొడ్డున వెలసిన పురాతనమైన కోదండరామ స్వామి ఆలయంలో ఈ నెల 17 నుంచి 24వ తేదీ వరకూ శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఈఓ మఠం మల్లికార్జున ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల నిర్వహణలో భాగంగా సరుకులు, పూలదండలు, పూల తోమాలల సరఫరా, లైటింగ్ డెకరేషన్, షామియానాలు, సప్లయర్స్ సామాన్ల ఏర్పాటుకు కాంట్రాక్టర్ల నుంచి కొటేషన్లను ఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 10 లోగా దేవస్థాన కార్యాలయంలో కొటేషన్లను అందజేయాలని ఆయన కోరారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

యల్లనూరు: ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని ఎస్‌ఐ గిరిబాబు సూచించారు. ఆదివారం తిరుమలాపురం క్రాస్‌లో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో పలు వాహనాలకు రికార్డులు లేకపోవడంతో అపరాధ రుసుం విధించారు. ఆటోలు, జీపుల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు. రికార్డులు లేని వాహనాలతో రోడ్లపైకి రావద్దన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పెద్దపప్పూరు: మండలంలోని ముచ్చుకోట గ్రామంలో ఆదివారం రాత్రి బొలేరా, ద్విచక్ర వాహనం ఢీకొని ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాలు.. ముచ్చుకోట గ్రామానికి చెందిన కమ్మగిరి, కుమార్తె కస్తూరి, కుమారుడు కళ్యాణ్‌రామ్ ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వస్తుండగా తాడిపత్రి నుంచి అరటి కాయల లోడుతో వస్తున్న బొలేరా వాహనం ఢీకొంది. ఘటనలో బైక్‌లో ఉన్న ముగ్గురూ గాయపడ్డారు. వారిని తాడిపత్రి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ శరత్‌చంద్ర తెలిపారు.

లయన్స్ క్లబ్‌కు ఉత్తమ సేవా అవార్డు



అవార్డు అందుకుంటున్న గుంతకల్లు లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

గుంతకల్లుటౌన్: వైద్య శిబిరాలతో సామాజిక సేవాకార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించిన గుంతకల్లు లయన్స్‌క్లబ్‌కు ఆ సంస్థ ఉత్తమసేవా పురస్కారాలను అందజేసింది. ఆదివారం ప్రొద్దుటూరులో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ గవర్నర్ ఇల్లూరు గోపి, క్లబ్ పట్టణ అధ్యక్షుడు ప్రసాద్, జోన్ చైర్మన్ డాక్టర్ రేణుక, రీజినల్ చైర్మన్ మధుమోహన్, వేల్చూరి రవి,జగన్నాథ్ తదితరులు పాల్గొని పలు అవార్డులను అందుకున్నారు.

క్లుప్తంగా

హింగులాజ్ మాత ఆవిర్భావ దినోత్సవం


అమ్మవారికి పూజ చేస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలోని చిన్న విఠోబ దేవాలయంలో రంగసుభే ఫిర్కా ఆధ్వర్యంలో హింగులాజ్ మాత ఆవిర్భావ దినోత్సవ ఆరాధన (జయంతి) ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయలంలోని అమ్మవారి విగ్రహాన్ని శోభాయానంగా అలంకరించారు. వేదపండితులు సూర్యనారాయణ, తేజ మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలకు ఒడిబియ్యం, పిల్లలకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ క్రిష్ణయ్య, ఆలయ సమాజ్ అధ్యక్షుడు టీటీ నాగభూషణ్‌రావు, యూ మంజునాథ్‌రావు, జే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నివాళి


ఇల్లూరులో నివాళులర్పిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి, వీరాంజనేయులు

గార్లదిన్నె: మండలంలోని ఇల్లూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సంజప్ప (75) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, శింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు ఇల్లూరుకు వెళ్లి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి, సర్పంచు జయరాములు, ఎంపీటీసీ సుజాత, శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ వీరాంజనేయులు, పసల ఆదినారాయణ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్‌విందుతో సమైక్యతాభావం


రాయలచెరువు ఇఫ్తార్ విందులో పాల్గొన్న జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి

యాడికి: రంజాన్ మాసంలో ఇచ్చే ఇఫ్తార్ విందు మత సామరస్యానికి, సమైక్యతా భావానికి ప్రతీక అని జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బాలా రమేష్‌బాబు అన్నారు. ఆదివారం రాత్రి మండల కేంద్రంలోని జామియా మసీదులో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బాలా రమేష్ బాబు, రాయలచెరువులోని జామియా మసీదులో జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి ఇఫ్తార్ విందుల్లో పాల్గొన్నారు. అనంతరం వారు ముస్లింలతో కలసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తలారీ నాగేష్, వేలూరు జగదీష్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే ముస్లింల అభ్యున్నతి


ఓటు అభ్యర్థిస్తున్న మున్సిపల్ సీపీ భవాని, వీసీలు మైమూన్, నైరుతిరెడ్డి

గుంతకల్లుటౌన్: ముస్లిం మైనార్టీలకు మేలు చేసిన ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ అని మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని, వైస్ చైర్‌పర్సన్లు మైమూన్, నైరుతిరెడ్డి అన్నారు. జగనన్నతోనే ముస్లిం మైనార్టీల అభ్యున్నతి సాధ్యమన్నారు. ఆదివారం పట్టణంలోని 35వ వార్డులో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా వైవీఆర్, ఎంపీగా శంకర్‌నారాయణను భారీ మెజార్టీతో గెలిపించాలని వారు అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వైవీఆర్ చిన్న కుమార్తె నిశితారెడ్డి, కౌన్సిలర్లు నీలావతి, సుమోబాషా, మైనార్టీ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గఫార్‌ఖాన్, నాయకులు ఆసిఫ్, తన్వీర్, సాధిక్, బుడేన్‌ఖాన్, ఆర్‌డీజీ.బాష, చాంద్‌బాషా, జాబీర్, జిలాన్, జఫ్రుల్లా, దౌలా, నూర్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ హెచ్‌ఎంకు సన్మానం

పామిడి: పట్టణంలోని సీఎస్‌ఐ చర్చిలో ఆదివార ఆరాధన కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం కే జయరాజును ఘనంగా సన్మానించారు. పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్, చర్చి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు వీరాంజనేయులు పర్యటన

నార్పల: శింగనమల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎం.వీరాంజనేయులు సోమవారం మండలంలోని నరసాపురం, నీలితోటిపల్లి, దుగుమర్రి, తుంపెర, గంగనపల్లి, ముచ్చుకుంటపల్లి గ్రామాల్లో పర్యటించన్నట్లు రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్, పార్టీ మండల కన్వీనర్ నిట్టూరు రఘునాథ్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయనతో పాటు అనంతపురం ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర్‌నారాయణ, రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి హాజరవుతారన్నారు. ఉదయం 7:30కు చామలూరు గ్రామంలో ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

ఘనంగా పూర్వాభాద్ర హోమం


పూర్వాభాద్ర హోమం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం పూర్వాభాద్ర హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ యాగశాలలో ఆంజనేయ స్వామి ఉత్సవ మూర్తిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య మన్యుసూక్త హోమాన్ని నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

‘కోటంక’లో ప్రత్యేక పూజలు

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు మూలవిరాట్‌కు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

నారాయణుడికి..

పెద్దపప్పూరు: మండలంలోని చిన్నపప్పూరు గ్రామ సమీపంలో వెలసిన అశ్వత్థ క్షేత్రంలో ఆదివారం శింగరబట్టు, గణపతి, నారాయణస్వామికి అర్చకులు సుధీర్‌కుమార్‌శర్మ, సునీల్ కుమార్‌శర్మ, బాలసుబ్రమణ్యశర్మ ప్రత్యేకపూజలు చేశారు. భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ. సుబ్రమణ్యం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

దుస్తుల దుకాణంలో చోరీ

తాడిపత్రి అర్బన్: దుస్తుల షాపులో చీరలను కొనుగోలు చేసేందుకు వచ్చిన మహిళలు చోరీకి పాల్పడిన ఘటన షాపు యజమాని ఫిర్యాదుతో ఆలస్యంగా వెలుగు చూసింది. అర్బన్ ఎస్‌ఐ గౌస్‌బాషా కథనం మేరకు.. పట్టణంలోని జయనగర్‌కాలనీ ఐదో రోడ్డులో ఉన్న కోమలి కిషోర్‌కుమార్‌రెడ్డికి చెందిన దుస్తుల దుకాణానికి శనివారం ఐదుగురు మహిళలు చీరెలను కొనుగోలు చేసేందుకు వచ్చారు. యజమానిని ఏమార్చి సుమారు రూ.60 వేల విలువ చేసే చీరలను వారు చోరీ చేశారు. అయితే ఈ విషయం మహిళలు షాపు నుంచి వెళ్లిపోయిన తరువాత తెలుసుకున్న యజమాని.. షాపులోని సీసీ పుటేజీలను పరిశీలించాడు.అందులో రికార్డు అయిన దృశ్యాలను బట్టి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీసీ పుటేజీ ఆధారంగా చోరీకి పాల్పడిన మహిళలను గుర్తించారు. ఆదివారం పట్టణంలోని చుక్కలూరు బైపాస్ రోడ్డు వద్ద కర్నూలు కల్లూరు ఎస్టేట్‌కు చెందిన సరోజమ్మ, రంగమ్మ, విజయలక్ష్మి సుజాత, అరుణజ్యోతిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి దొంగలించిన 12 చీరలను స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చేతిపంపులకు మరమ్మతు

గుత్తి రూరల్: మండలంలోని పి.ఎర్రగుడి గ్రామంలో సర్పంచ్ మోటా పాపన్న చేతి పంపులు, తాగునీటి మోటార్లకు ఆదివారం మరమ్మతు చేయించారు. చేతి పంపులు, తాగునీటిని సరఫరా చేసే మోటార్లు చెడిపోయి గ్రామంలో నీటి సమస్య తీవ్రంగా ఉండటంతో సర్పంచ్ స్పందించారు. గ్రామంలోని ఎస్టీ కాలనీలో మూడు చేతిపంపుల్లో నీళ్లు అడుగంటి మరమ్మతులకు గురయ్యాయి. మెకానిక్‌ల సాయంతో చేతి పంపులలో నీళ్లు అందేలా పైపులను లోపలకు దింపారు. గ్రామంలోని బీసీ కాలనీలో బోరు మరమ్మతులకు గ్రామస్తులు పెద్ద ఓబులేసు, పుల్లన్న, ఓబులేసు, వెంకటప్పతో పాటుగా మరికొందరు స్వచ్ఛందంగా వచ్చి సహాయం చేశారు. గంగమ్మ ఆలయం వద్ద ఉన్న బోరుతో పాటుగా గ్రామంలోని అన్ని బోర్లు, చేతిపంపులకు మరమ్మతులు చేయడంపై గ్రామస్తులు సర్పంచ్‌ను అభినందించారు.

త్రైత సిద్ధాంత క్యాలెండర్ ఆవిష్కరణ

గుత్తి: పట్టణంలోని మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ ఇంట్లో ఆదివారం త్రైత సిద్ధాంత తెలుగు సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌తోపాటు వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పీరా, నాయకులు షఫి క్యాలెండర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత సభ్యులు పాల్గొన్నారు.